సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం ◆ 6 ◆ జూలై ◆ 2023



పెంపుడు జంతువులతో జాగ్రత్త

పెంపుడు జంతువుల నుంచి కూడా వ్యాధులు సోకే ప్రమాదం ఉందని పలువురు వైద్యులు, శాస్త్రవేత్తలు చెబుతున్నారు. 8లో



సమ్మెబాటలో జీపీ కార్మికులు

సమస్యల పరిష్కారం కోసం గురువారం నుంచి సమ్మె బాట పట్టాలని గ్రామ పంచాయతీ కార్మికులు నిర్ణయించారు. 10లో

గరిష్టం / కనిష్టం
28° / 24°

వాతావరణం

జిల్లాలో గురువారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది.

పునాదికి బీటలు !

- జిల్లా అభివృద్ధికి తోగ్గూడెం గుట్టల రాళ్లే కీలకం
- ఇప్పుడవి అవినీతికి కేరాఫ్ అడ్రస్‌గా మారుతున్న వైనం
- ఇష్టారాజ్యంగా కొండలను తవ్వుతున్న మాఫియా
- అనుమతులు తీసుకోరు, జరిమానా చెల్లించరు..
- కళ్లెదుటే అక్రమాలకు పాల్పడినా అడిగేవారు లేరనే ధైర్యం



పాల్వంచ మండలం తోగ్గూడెంలో కొనసాగుతున్న అక్రమ మైనింగ్



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: దేశవ్యాప్తంగా బొగ్గుకు భారీ డిమాండ్ ఉంది. బొగ్గు కోసం సింగరేణి సంస్థకు ముందస్తు అడ్వాన్స్ ఇచ్చేందుకు ఎన్టీపీసీ సిద్ధంగా ఉంది. కానీ డిమాండ్‌కు తగ్గ స్థాయిలో బొగ్గు ఉత్పత్తి చేయడానికి సింగరేణి ఆపసోపాలు పడుతోంది. కొత్తగూడెం, ఇల్లెందు ఓపెన్ కాస్టులకు తోడు ఒడిశాలోని నైనీ బ్లాక్ నుంచి ఇప్పటికీ బొగ్గు ఉత్పత్తి కావడం లేదు. స్థల సేకరణ, పర్యావరణ అనుమతులు తదితర కారణాలతో ఏడాది కాలంగా కొత్త గనుల ప్రారంభానికి సింగరేణి ఆలుపెరగని కృషి చేస్తోంది. కానీ మైనింగ్‌కు మాత్రం ఈ నిబంధనలు, అనుమతులు ఏమీ పట్టడం లేదు. 'రూల్స్ జాన్తానై, పర్మిషన్లు ఏమీ మాకు వర్తించవు. మాకు తోచినట్టు, మాకి నచ్చినంత మేర మైనింగ్ చేసుకుంటాం. అడ్డుకునే వారెవరో చూస్తాం' అంటోంది జిల్లాలోని స్టోన్ క్రషర్ మాఫియా. పాల్వంచ మండలం తోగ్గూడెంలోని ఎత్తయిన కొండలను, భూమి లోతుల్లోని బండలను ఇష్టారాజ్యంగా దోచేస్తోంది.

అభివృద్ధికి పునాది..

భద్రాద్రి జిల్లా అంటే ముందు గుర్తొచ్చేది సింగరేణి బొగ్గు గనులు. వాటితోనే జిల్లాలో పారిశ్రామికీకరణ వేగంగా ఊపందుకుంది. ఈ క్రమంలో కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్, దానికి అనుబంధంగా కిన్నెరసానిపై డ్యామ్ నిర్మించాల్సిన అవసరం ఏర్పడింది. మొదటిసారి డ్యామ్ నిర్మాణానికి అవసరమైన రాయి కోసం పాల్వంచ మండలం తోగ్గూడెం సమీపంలోని బండరాళ్లను ఎంపిక చేసుకున్నారు. దీని కోసం ఇక్కడ మైనింగ్‌కు అనుమతులు ఇవ్వడంతో పాటు స్టోన్ క్రషింగ్ యూనిట్ల స్థాపనకు 1950వ దశకంలోనే అనుమతులు జారీ చేశారు. అప్పటి నుంచి ఇక్కడ మైనింగ్ కొనసాగుతోంది. ప్రారంభంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాలు, పరిశ్రమలు, రోడ్ల నిర్మాణాలకు ఇక్కడి నుంచే రాయిని తరలించేవారు. జిల్లా ప్రస్తుత అభివృద్ధికి పునాది రాయంతా తోగ్గూడేనిదే అని చెప్పొచ్చు.

రూ. 300 కోట్ల జరిమానా..

ఆరంభంలో ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఇక్కడ మైనింగ్ జరిగేది. కానీ రానురాను నిబంధనలను మైనింగ్ క్వారీల్లో పాతరేసి ఇష్టారీతిగా సహజ సంపదను దోచుకుపోతున్నారు. కొంతమేర భూమిని మైనింగ్ కోసం లీజుకు తీసుకుని దాని చుట్టుపక్కనున్న స్థలమంతా యథేచ్ఛగా తవ్వుతున్నారు. బాంబులతో పేల్చేస్తున్నారు. పగిలిన రాళ్లను భారీ యంత్రాలతో తునాతునకలు చేసి క్రషర్లకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి వాణిజ్య అవసరాలకు అమ్ముకుంటూ జేబులు నింపుకుంటున్నారు. ఏళ్ల తరబడి నిరాటంకగా ఈ దందా కొనసాగించారు. అయితే ఆలస్యంగానైనా కళ్లు తెరిచిన మైనింగ్ అధికారులు చివరకు అక్రమాలపై కొరడా ఝుళిపించారు. పరిమితికి మించి మైనింగ్ చేశారని ఆధారాలతో సహా నిరూపించి, ఎనిమిదికి పైగా సంస్థలకు రూ. 300 కోట్ల మేర జరిమానా విధించారు.

మైనింగ్ సంస్థల లాబీయింగ్..

ప్రభుత్వం విధించిన జరిమానాను ఇప్పటివరకు చెల్లించని మైనింగ్ సంస్థలు.. రూ. 300 కోట్ల ఫైన్ చెల్లించే స్థోమత లేదంటూ బీద అరుపులతో చివరకు జరిమానాను రూ.100 కోట్లకు తగ్గించేలా లాబీయింగ్ చేయించుకున్నారు. కనీసం ఆ నగదు సైతం ఇప్పటి వరకు చెల్లించలేదు. ఇంతటితో ఈ వ్యవహారం ముగిసిపోలేదు. ప్రభుత్వం కన్నెర్ర చేయడంతో ఒకటి, రెండు మైనింగ్ కంపెనీలు వెనుకడుగు వేసినా మరో ఆరు సంస్థలు ప్రస్తుతం తోగ్గూడెంలో మైనింగ్ చేస్తున్నాయి. వీటికి సంబంధించిన లీజు పరిమితి ఈ ఏడాది జూన్ 30తో ముగిసింది. తర్వాత రెన్యువల్ చేయించుకోకున్నా మైనింగ్ మాఫియా దందా ఆగడం లేదు. తమ పనులు ఆపే వారెవరు? పర్మిషన్లతో తమకేం పని అన్నట్టుగా రేయింబవళ్లు కొండలను తొలిచేస్తున్నారు.

మామూళ్ల మత్తులో..

మారుమూల అటవీ ప్రాంతంలో అవినీతి జరుగుతోందంటే విషయం బటయకు పొక్కేందుకు సమయం పడుతుంది. కానీ విజయవాడ – జగదల్‌పూర్ జాతీయ రహదారికి నాలుగు కి.మీ. దూరంలో పాల్వంచ పట్టణానికి సమీపంలో మైనింగ్ జరుగుతున్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. తనిఖీలు చేసినప్పుడు అక్రమ మైనింగ్ వెలుగుచూసినా తూతూ మంత్రపు చర్యలతో సరిపెడుతున్నారు. మైనింగ్ మాఫియా ఇచ్చే మామూళ్ల కారణంగానే అక్రమాలపై ఉక్కుపాదం మోపడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అక్రమ మైనింగ్ నిజమే



తోగ్గూడెంలో ప్రస్తుతం ఆరు సంస్థలు మైనింగ్ చేస్తున్నాయి. వీటి లీజు గడువు 2023 జూన్ 30తో ముగిసింది. అక్రమ మైనింగ్ చేస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది, తనిఖీలకు వెళ్లినప్పుడు దొరక్కుండా జాగ్రత్త పడుతున్నారు. మరింత విస్తృతంగా తనిఖీలు చేస్తాం.

– జయ్‌సింగ్, మైనింగ్ ఏడీ

వ్యర్థాలు కనిపిస్తే కమిషనర్లపై చర్యలు

- మున్సిపాలిటీల్లో గ్రీనరీ పెంచాలి
- డ్రెయిన్లు, రోడ్లు శుభ్రంగా ఉండాలి
- పట్టణ ప్రగతి సమీక్షలో కలెక్టర్ అనుదీప్



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

సూపర్‌బజార్(కొత్తగూడెం): మున్సిపాలిటీల్లో గ్రీనరీ పెంచేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని కలెక్టర్ అనుదీప్ మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. ఐడీఓసీలో బుధవారం పట్టణ ప్రగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హరితహారంపై దృష్టి సారించాలని, ప్రతీ వార్డులో మొక్కలు నాటడంతోపాటు పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించాలని సూచించారు. హరితహారంలో ప్రతి ఇంటికి ఆరు మొక్కలు పంపిణీ చేయాలన్నారు. అవెన్యూ ప్లాంటేషన్‌లో మొక్కలు నాటేందుకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. మున్సిపాలిటీల్లో జరుగుతున్న పనులను నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్లను ఆదేశించారు. వర్షాకాలంలో డ్రెయిన్లు, రోడ్లు శుభ్రంగా ఉండేలా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, వ్యర్థాలు పేరుకుపోయి మురుగు నీరు నిల్వ ఉంటే సంబంధిత కమిషనర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మురుగు నీటి నిల్వలతో దోమల వ్యాప్తి జరిగి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని అన్నారు. మరమ్మతుకు గురైన ఫాగింగ్ యంత్రాలను తక్షణమే రిపేర్ చేయించి వినియోగంలోకి తేవాలని సూచించారు. అనుమతి లేకుండా ఇళ్ల నిర్మించే వారికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. వైకుంఠధామాలు, సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ల నిర్మాణ ప్రగతిని సమీక్షించి ప్రారంభోత్సాలకు సిద్ధం చేయాలని ప్రజారోగ్య శాఖ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. సమావేశంలో కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు మున్సిపల్ కమిషనర్లు రఘు, అంకుషావలి, ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికులకు పన్ను మినహాయింపు

ఇంటిపన్నుల చెల్లింపులో మాజీ సైనికులకు మినహాయింపు ఇవ్వాలని కలెక్టర్ అనుదీప్ అన్నారు. ఐడీఓసీలో బుధవారం నిర్వహించిన జిల్లా సైనిక బోర్డు సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ పరిధిలో నివసిస్తున్న మాజీ సైనికులకు, ప్రస్తుతం పని చేస్తున్న వారికి మినహాయింపు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని పంచాయతీ, మున్సిపల్ సిబ్బందికి సూచించారు. కేటీపీఎస్, బీటీపీఎస్, బీపీఎల్, సింగరేణి, గురుకుల పాఠశాలల్లో మాజీ సైనికులను సెక్యూరిటీ గార్డులుగా నియమించేందుకు ప్రభుత్వం నిర్దేశించిన రిజర్వేషన్లు అమలు చేస్తామన్నారు. డబుల్ బెడ్‌రూమ్, గృహలక్ష్మి పథకాల్లో ప్రాధాన్యత కల్పించాలన్నారు. ప్రైవేట్ సంస్థల్లో ఉపాధి కల్పనకు ప్రత్యేక జాబ్‌మేళా నిర్వహించాలని జిల్లా ఉపాధి కల్పనాధికారికి సూచించారు. మాజీ సైనికుల సొసైటీ ఏర్పాటుకు జాబితా సిద్ధం చేయాలని జిల్లా సైనికాధికారికి సూచించారు. అసోసియేషన్ కార్యాలయ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని మాజీ సైనికులు కోరగా స్థల సేకరణ చేయాలని డీఆర్‌ఓను ఆదేశించారు. సమావేశంలో జిల్లా సైనిక సంక్షేమాధికారి శ్రీరామ్, డీపీఓ రమాకాంత్, డీఎంహెచ్‌ఓ శిరీష, డీపీఆర్‌ఓ శ్రీనివాస్, ఉపాధి కల్పనాధికారి విజేత, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ రఘు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించండి


జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య



అధికారులతో సమీక్షిస్తున్న కోరం కనకయ్య, పక్కన జెడ్పీ వైస్ చైర్మన్, సీఈఓ తదితరులు

చుంచుపల్లి: బీసీలకు ప్రభుత్వం అందించే రూ.లక్ష సాయం వంటి పథకాలపై అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య అన్నారు. బుధవారం జరిగిన జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితబంధు వంటి పెద్ద పథకాలకు ఎలాంటి నిబంధనలు విధించని ప్రభుత్వం.. చేతివృత్తుల వారికి ఇచ్చే రూ.లక్ష విషయంలో అనేక నిబంధనలు పెట్టడంతో లబ్ధిదారులకు అడ్డంకులు ఎదురవుతున్నాయని చెప్పారు. రేషన్ షాపుల ద్వారా పేదలకు అందించే సరుకులు సక్రమంగా ఇచ్చేలా చూడాలన్నారు. గ్రామీణ ప్రాంతాలకు ఆర్టీసీ సౌకర్యం మెరుగుపడేలా సంబంధిత అధికారులు చూడాలని ఆదేశించారు. ఇల్లెందు బస్ డిపో విషయంలో ఎలాంటి పురోగతి లేదని, ఇప్పటికైనా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ములకలపల్లి మండలం పొగళ్లపల్లి గ్రామానికి తక్షణమే బస్సు సౌకర్యం కల్పించాలని అధికారులకు సూచించారు. గ్రామాల్లో పోడు పట్టాల పంపిణీ సక్రమంగా జరిగేలా అటవీ శాఖ, ఐటీడీఏ అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. టేకులపల్లి మండలం కోయగూడెం పంచాయతీలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చోరీ విషయంలో విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను కోరారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, అధికారులు ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని, వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని చెప్పారు. ప్రతి స్థాయీ సంఘాల సమావేశంలో చర్చించిన అంశాల విషయంలో పురోగతి ఉండాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు, జెడ్పీ సీఈఓ విద్యాలత, డిప్యూటీ సీఈఓ నాగలక్ష్మి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో పొగమంచు !



సహజంగా శీతాకాలంలో పొగమంచు కనిపిస్తుంది. కానీ పాల్వంచ పట్టణాన్ని వర్షాకాలంలో పొగమంచు కమ్మేసింది. లక్ష్మీదేవిపల్లి, ఇందిరానగర్ కాలనీ సమీపంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి గుట్ట వద్ద బుధవారం తెల్లవారుజామున ఆరు గంటల సమయంలో ఇలా ఇళ్లు కూడా కనిపించనంతగా మంచుదుప్పటి పరుచుకుంది. దీంతో జనమంతా ఇదేం విచిత్రమని ఆశ్చర్యపోయారు. – పాల్వంచరూరల్

న్యూస్‌రీల్

రోడ్డు పనులకు అటవీశాఖ అనుమతి

చుంచుపల్లి: పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం కింద చేపట్టే ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకంలో మంజూరైన రోడ్డు ప్రాజెక్టు పనులకు అటవీశాఖ అనుమతులు లభించినట్లు పీఆర్ ఈఈ మంగ్యానాయక్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆళ్లపల్లి మండలం మర్కోడు నుంచి పెద్దూరు వరకు రహదారి నిర్మాణానికి 1.32 హెక్టార్ల అటవీ భూమిని బదలాయించారని పేర్కొన్నారు.

అభ్యర్థుల ప్రొవిజనల్ జాబితా విడుదల

కొత్తగూడెంఅర్బన్: పాఠశాల విద్యాశాఖలో సమగ్ర శిక్షా అభియాన్ కింద డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎంఐఎస్ కో – ఆర్డినేటర్లు, సిస్టమ్ అనలిస్ట్, అసిస్టెంట్ ప్రోగ్రామర్, ఐఈఆర్‌పీ పోస్టుల భర్తీకి అర్హత సాధించిన అభ్యర్థుల ప్రొవిజనల్ లిస్ట్‌ను విడుదల చేసినట్లు డీఈఓ సోమశేఖర శర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని మండలాల విద్యా వనరుల కేంద్రంలో జాబితాను ప్రదర్శించామని, ధ్రువపత్రాల తనిఖీకి హాజరైన వారంతా ఆయా ఎంఈఓ కార్యాలయాలకు వెళ్లి జాబితా చూసుకోవాలని సూచించారు. ఏమైనా అభ్యంతరాలుంటే గురువారం(నేడు) సాయంత్రం 4 గంటల్లోగా తమ కార్యాలయంలో ఫిర్యాదు చేయొచ్చని పేర్కొన్నారు.

ముగ్గురు పీపీల నియామకం



రాధాకృష్ణమూర్తి, నాగిరెడ్డి, విజయ్‌కుమార్

కొత్తగూడెంటౌన్:జిల్లాలో కొత్తగా ముగ్గురు పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పోసాని రాధాకృష్ణమూర్తిని, పోక్సో కోర్టుకు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది వెలగాల నాగిరెడ్డిని, మొదటి అదనపు జిల్లా, సెషన్స్ కోర్టుకు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది రావి విజయ్‌కుమార్‌ను నియమించింది.

సింగరేణి కార్మికుల నిరాహార దీక్ష



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ వేతనాలు అమలు చేయాలని, కుటుంబసభ్యులందరికీ ఈఎస్‌ఐ వైద్య సేవలు అందించాలని తదితర డిమాండ్ల పరిష్కారానికి కార్మికులు సింగరేణి ప్రధాన కార్యాలయం వద్ద బుధవారం ఒకరోజు నిరాహారదీక్ష చేపట్టారు. ఆదివారం, ఓటీ చేసిన కార్మికులకు చట్ట ప్రకారం అదనపు వేతనాలు చెల్లించాలని, కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్మికుల దీక్షకు పలువురు మద్దతు ప్రకటించారు. కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు శిబిరాన్ని సందర్శించి మాట్లాడారు. కార్మికుల సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే యాజమాన్యంతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, కాపు కృష్ణ ఉన్నారు. కాగా, బీఎస్పీ నాయకుడు ఎర్రా కామేష్ దీక్షా శిబిరానికి వచ్చి కార్మికులకు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మికుల హక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షుడు రాసూరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కరకగూడెం పీహెచ్‌సీకి ఎన్‌క్వాస్ గుర్తింపు

కరకగూడెం: కరకగూడెం పీహెచ్‌సీకి ఎన్‌క్వాస్ గుర్తింపు లభించిందని వైద్యాధికారి కారం మధు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పీహెచ్‌సీలో సిబ్బందితో కలిసి బుధవారం కేక్ కట్‌చేశారు. అనంతరం మాట్లాడుతూ.. మూడేళ్ల వరకు ఈ గుర్తింపు కొనసాగుతుందన్నారు. పీహెచ్‌సీ పరిధిలో ఆరు అంశాల్లో కేంద్ర, రాష్ట్ర అధికారులు వేర్వేరుగా పరిశీలించారని, సమగ్ర నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందించగా 73 శాతం మార్కులతో ఎన్‌క్వాస్ గుర్తింపు దక్కిందని వివరించారు. దీంతో పీహెచ్‌సీకి ఏటా రూ. 3 లక్షల చొప్పున మూడేళ్ల పాటు మంజూరవుతాయని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు నిరాశే మిగిలింది

- టీపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు నర్సింహారెడ్డి
- పీవైఎల్ రాష్ట్ర మహాసభలో ప్రారంభోపన్యాసం



మాట్లాడుతున్న నర్సింహారెడ్డి, పక్కన పీవైఎల్, ఎన్డీ నాయకులు

ఇల్లెందు: కేంద్రంలో ప్రధాని నరేంద్రమోడీ, రాష్ట్రంలో సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో నిరుద్యోగులకు నిరాశే మిగిలిందని టీపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ఎ.నర్సింహారెడ్డి అన్నారు. ఇల్లెందులో జరుగుతున్న పీవైఎల్ రాష్ట్ర మహాసభల్లో బుధవారం ఆయన మాట్లాడారు. పాలకులు, సామ్రాజ్యవాదులు కలిసి యువతను దారి తప్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2016లో మోడీ అకస్మాత్తుగా పెద్దనోట్లు రద్దు చేశారని, దీంతో చేతిలో డబ్బు లేక ప్రజలు ఆరు నెలల పాటు అనేక ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. ఈ తరుణంలోనే జీఎస్టీ తీసుకొచ్చి మరో పిడుగు వేశారని విమర్శించారు. మోడీ హయాంలో పెట్రోల్, డీజిల్‌తో పాటు నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయని, ప్రజల అభివృద్ధిని కాంక్షించడం ఇదేనా అని ప్రశ్నించారు. ప్రజల కొనుగోలు శక్తి పెరిగితేనే అభివృద్ధి సాధించినట్టని చెప్పారు. ప్రజా సమస్యలు పరిష్కరించకుండా వారి దృష్టిని మళ్లించేందుకు రామాలయ నిర్మాణం, పాకిస్తాన్, కశ్మీర్ వంటి సరిహద్దు సమస్యలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. బీజేపీయేతర రాష్ట్రాల్లో గవర్నర్లు అక్కడి పాలనకు అడ్డు పడుతుంటారని, బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో మాత్రం ఆ సమస్య ఉత్పన్నం కావడం లేదని, దీనర్థం ఏంటని ప్రశ్నించారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ సైతం అలాంటి పాలనే సాగిస్తున్నారని తెలిపారు. ఇచ్చిన ఏ ఒక్క హామీనీ అమలు చేయడం లేదన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కరించకుండా యువతను బలి చేస్తున్నారని విమర్శించారు. ఈ తరుణంలో యువకులు తమ ఆలోచనలకు పదును పెట్టి సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మహాసభలో పీవైఎల్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డి.సాయిరెడ్డి, ఇందూరి సాగర్, ఎన్డీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య, అరుణోదయ రాష్ట్ర అధ్యక్షుడు పరకాల నాగన్న, గుండాల ఎంపీపీ ముక్తి సత్యం, పీవైఎల్ నాయకులు కోలా లక్ష్మీనారాయణ, చింతా నర్సింహారావు, పర్శిక రవి, తుపాకుల నాగేశ్వరరావు, కె. సారంగపాణి తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం రీజియన్‌కు 20 మంది డ్రైవర్లు

ఖమ్మంమామిళ్లగూడెం: గతంలో టీఎస్ఆర్టీసీ ఖమ్మం రీజియన్ పరిధిలో విధులు నిర్వర్తించి డిప్యూటేషన్‌పై గ్రేటర్ హైదరాబాద్ జోన్‌కు వెళ్లిన 20 మంది డ్రైవర్లను తిరిగి మాతృ రీజియన్‌కు కేటాయించారు. ఈమేరకు గ్రేటర్ హైదరాబాద్ జోన్ డిప్యూటీ చీఫ్ పర్సనల్ మేనేజర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిని డిపో మేనేజర్లు తక్షణమే రిలీవ్ చేయాలని, ఆతరర్వాత డ్రైవర్లు ఖమ్మంలో పర్సనల్ ఆఫీసర్‌కు రిపోర్టు చేయాలని ఉత్తర్వుల్లో సూచించారు.

పాత కాల్వకు కొత్త గేట్లు!

కూసుమంచి: పాలేరు రిజర్వాయర్ పాత కాల్వ గేట్ల మార్పుపై అధికారులు దృష్టి సారించారు. పనులకు ఆటంకం కలగకుండా బుధవారం గేట్ల సమీపాన మట్టితో రింగ్‌బండ్ వేశారు. ఇక గురువారం నుండి ప్రస్తుత గేట్లు తొలగించి కొత్తవి అమర్చనున్నారు. గేట్లు మరమ్మతులకు గురికావటంతో నీరు కాల్వలోకి వృథాగా పారడమే కాక గేట్లు ఎత్తి, దించే సమయాన ఇబ్బంది ఎదురవుతోంది. కాగా, ఈ పనులతో కాల్వకు నీటి విడుదల ఆలస్యం కానుంది. ప్రస్తుతం రైతులు వరినార్లు పోయగా, చెరకు సాగు చేస్తున్నారు. దీంతో త్వరగా పనులు పూర్తిచేసి నీటి విడుదలకు ఇబ్బంది లేకుండా చేస్తామని జల వనరుల శాఖ అధికారులు తెలిపారు.

ముగిసిన 'ఎన్‌క్వాస్' పరిశీలన

- భద్రాద్రి ఆస్పత్రిలో మూడు రోజుల పాటు తనిఖీలు
- అంతా బాగుందని కితాబిచ్చిన బృందం



ఫార్మసీలో రికార్డులను పరిశీలిస్తున్న ఎన్‌క్వాస్ బృందం సభ్యులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో మూడు రోజుల పాటు ఎన్‌క్వాస్ (జాతీయ నాణ్యత హామీ ప్రమాణాల) బృందం అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించింది. జాతీయ ప్రమాణాల మేరకు ఏరియా ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలు, తదితర అంశాలపై బృందం సభ్యులు డాక్టర్ పఠాని(ఢిల్లీ), భారతి (చెన్నై), గుణశీల (బెంగళూరు), ప్రతిక్ మోదీ (భోపాల్) తనిఖీ చేసి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ క్రమంలో బుధవారం ఏరియా ఆస్పత్రిలో పలు విభాగాలను పరిశీలించి వైద్యులు, సిబ్బందికి పలు అంశాలపై అవగాహన కల్పించారు. అన్ని విభాగాల్లో గుర్తించిన లోటుపాట్లను సాధ్యమైనంత త్వరగా చక్కదిద్దుకోవాలని అధికారులకు సూచించారు. రికార్డులను తప్పనిసరిగా వినియోగించాలని, వాటిని ఆస్పత్రి అధికారులు నిత్యం పర్యవేక్షించాలని చెప్పారు. రక్తనిధి కేంద్రంలో రికార్డులన్నీ సరిగానే ఉన్నాయని, అన్ని విభాగాల్లోనూ ఇలాగే ఉంచాలని అన్నారు. ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందించేలా కృషి చేయాలని, అప్పుడే వైద్యులకు వృత్తి పట్ల సంతృప్తి కలుగుతుందని అన్నారు. మొత్తంగా ఆస్పత్రిలో సేవలు బాగున్నాయని కితాబిచ్చారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ రామకృష్ణ, ఆర్ఎంఓ రాజశేఖర్ రెడ్డి, నవ్య, కిషన్, మల్లేష్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

బీఎల్ఓలు ఇంటింటి సర్వే చేయాలి

అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



సిబ్బందితో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

అశ్వారావుపేటరూరల్: ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు చేపట్టి తుది జాబితా రూపొందించేందుకు బీఎల్ఓలు ఇంటింటికీ వెళ్లి సమగ్ర సర్వే చేయాలని అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆయన వివిధ పార్టీల నాయకులు, బీఎల్ఓలు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మరణించిన వారి పేర్లు ఓటర్ జాబితాలో ఉంటే తొలగింపునకు ప్రతిపాదనలు చేయాలని బీఎల్ఓలకు సూచించారు. ఓటర్లకు పోలింగ్ కేంద్రం 2 కి.మీ దూరం ఉంటే, దగ్గరలో ఉన్న పోలింగ్ కేంద్రాలకు తమ పేర్లను మార్చుకునేందుకు వీలుగా దరఖాస్తు చేయించాలని చెప్పారు. మండలంలోని గోగులపూడి, రమణక్కపేట గ్రామాలను సందర్శించి వారి సమస్యలను తెలుసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాను సిద్ధం చేసేందుకు జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. అక్టోబర్ 1 నాటికి తుది జాబితా ప్రకటిస్తామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

క్లుప్తంగా

రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్



మాట్లాడుతున్న డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

కొత్తగూడెంటౌన్: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, సాధారణ ప్రజా జీవితానికి ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ హెచ్చరించారు. బుధవారం కొత్తగూడెం వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో నేరాలకు పాల్పడకుండా, ఘర్షణలకు వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. సెటిల్‌మెంట్‌లు, గొడవల్లో తలదూర్చితే వదిలిపెట్టేది లేదన్నారు. అందరిపై నిఘా పెట్టామని అన్నారు. రౌడీ షీటర్లు ఎవరినైనా ఇబ్బందులకు గురి చేస్తే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సీఐ ఎం.కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

102లో ఉద్యోగాలకు రాతపరీక్ష, ఫిజికల్ టెస్ట్



నేలపై కూర్చుని పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

భద్రాచలం అర్బన్ : 102 అమ్మ ఒడి అంబులెన్సులో డ్రైవర్ ఉద్యోగాల కోసం భద్రాచలం ఏరియా ఆస్పత్రిలోని 108 కార్యాలయంలో బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లా నుంచి 36 మంది హాజరుకాగా ట్రాఫిక్ నిబంధనలపై రాతపరీక్షతో పాటు ఉత్తీర్ణత సాధించిన ఇరవై మందికి ఫిజికల్ టెస్ట్ నిర్వహించగా ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ సాయికిరణ్ పర్యవేక్షించారు. కాగా, అభ్యర్థులకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో నేలపైనే కూర్చుని పరీక్ష రాయాల్సి వచ్చింది.

రేపు రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎన్నికలు



రైల్వేస్టేషన్ ఆవరణలో వెలిసిన ప్రచార ఫ్లెక్సీలు

కొత్తగూడెంఅర్బన్: సౌత్ సెంట్రల్ రైల్వే భద్రాచలం రోడ్ బ్రాంచ్ రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎన్నికలు ఈ నెల 7న నిర్వహించనున్నారు. ఎన్నికల్లో మూడు యూనియన్లు ఎంప్లాయిస్ సంఘ్, మజ్దూర్ యూనియన్, ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, ఎంప్లాయిస్ అసోసియేషన్ తలపడుతున్నాయి. ఇప్పటికే ఆయా సంఘాల నాయకులు పోటాపోటీగా ప్రచారం నిర్వహించారు. శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది. అనంతరం కౌంటింగ్, ఫలితాల వెల్లడి ఉంటుంది. ఎన్నికల అధికారిగా ఏఓ రజినీష్‌కుమార్ మీనా వ్యవహరిస్తున్నారు.

పోడు పట్టాలిప్పిస్తామని డబ్బులు దండుకున్నారు

పోలీసులను ఆశ్రయించిన బాధితులు

ఇల్లెందురూరల్: మండల పరిధిలోని రొంపేడు సర్పంచ్ ఆజ్మీర శంకర్ తమకు పోడు భూములకు పట్టాలిప్పిస్తామని నమ్మించి మోసం చేశారంటూ గ్రామానికి చెందిన 40 మంది రైతులు బుధవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం ప్రకారం.. పోడు భూముల దరఖాస్తు సమయంలో తమను కలిసిన సర్పంచ్ శంకర్ ప్రతీ ఒక్కరికి పట్టాలిప్పిస్తామని నమ్మబలికారు. అందుకు ఖర్చవుతుందని చెప్పి తమ వద్ద మొత్తంగా రూ.3.65 లక్షలు వసూలు చేశారని ఆరోపించారు. పట్టాలు రాకపోవడంతో ఎన్ని సార్లు ప్రశ్నించినా సమాధానం చెప్పడం లేదని వాపోయారు. చేసేది లేక న్యాయం కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ ఘటనపై సర్పంచ్ శంకర్‌ను వివరణ కోరగా.. తాను ఎవరి నుంచీ డబ్బులు వసూలు చేయలేదని, రాజకీయంగా ఇబ్బంది పెట్టే కుట్రలో భాగంగానే ఇదంతా చేస్తున్నారని తెలిపారు.

డ్రెయినేజీలో పడి వ్యక్తి మృతి

చర్ల: చర్లలో ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు డ్రెయినేజీలో పడి మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపురానికి చెందిన సానబోయిన సురేష్ (42)కు పాతచర్లకు చెంది మహిళతో వివాహం కాగా కొన్నేళ్లుగా సురేష్ భార్యా పిల్లలతో చర్లలోనే నివాసముంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం పూజారిగూడెం వైపు నుంచి నడుచుకుంటూ వస్తున్నాడు. అలసటగా ఉండటంతో జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల సమీపంలో డ్రెయినేజీ పక్కన విరిగి పడిపోయి ఉన్న విద్యుత్ స్తంభం మీద కూర్చున్నాడు. ఈ క్రమంలోనే స్పృహతప్పి డ్రెయినేజీలో పడి మృతి చెందాడని స్థానికులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,623

పెంపుడు జంతువులతో జాగ్రత్త

- వ్యాధులు సంక్రమించే ప్రమాదం

నేడు 'వరల్డ్ జూనోసిస్ డే'

భద్రాచలంఅర్బన్: కొందరు కాలక్షేపం, సరదాగా పెంపుడు జంతువులను పెంచుకుంటారు. వాటి నుంచి కూడా వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధులను జూనోసిస్‌గా పేర్కొంటారు. వ్యాధులు సంక్రమించకుండా అవగాహన పెంపొందించుకోవడం, జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో అవసరం. నేడు వరల్డ్ జూనోసిస్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.

ఏయే వ్యాధులు సోకే ప్రమాదం ఉందంటే..

శాస్త్రవేత్తలు, వైద్యుల అంచనాల ప్రకారం జంతువుల నుంచి మనుషులకు దాదాపుగా 200 రకాల వ్యాధులు సోకుతాయి. పెంపుడు జంతువుల వల్ల పిల్లలకు ముప్పు ఎక్కువగా ఉంటుంది. కరోనా వైరస్ గబ్బిలాల నుంచి వ్యాపించినట్లు పేర్కొన్నా పూర్తిస్థాయి నిర్ధారణ జరగలేదు. పందుల ద్వారా మెదడువాపు వ్యాధి, కుక్కలద్వారా రేబిస్, గొర్రెలు, మేకలద్వారా ఆంత్రాక్స్, ఆవులు, గేదెల ద్వారా క్షయ, పాలద్వారా బ్రూసెల్లోసిస్ వ్యాపిస్తుంది. బ్రూసెల్లోసిస్ వల్ల కీళ్లనొప్పులు, జ్వరం ఉంటుండగా వ్యంధత్వం సంక్రమిస్తుంది. పక్షులవల్ల సిటాకోసిస్, ఎలుకలతో ప్లేగు, పిల్లుల ద్వారా పాగ్స్‌ప్లాస్మోక్రాండై, కోళ్లద్వారా బర్డ్‌ఫ్లూ, కుందేళ్ల ద్వారా టాక్సోప్లాస్మోసిస్, కోతుల ద్వారా లెప్రసీ, ఇతరత్రా జంతువులు, పక్షుల ద్వారా చర్మ, శ్వాస సంబంధిత వ్యాధులు మనుషులకు వ్యాపిస్తాయి. రేబిస్ సోకిన కుక్కలను ముట్టుకున్నా, ముద్దుచేసినా వ్యాధి అంటుకుంటుంది. వ్యాధులు సోకిన కోళ్లు, గొర్రెలు, జంతువులు, పశువుల మాంసం తిన్నా కూడా మనుషులకు వ్యాధులు వ్యాపిస్తాయి. కుక్కలు తదితరాల మలమూత్రాల వల్ల కూడా వ్యాధులు సంక్రమిస్తాయి. కుక్కలు, పిల్లులను ఒడిలో, సోఫాల్లో, మంచాల్లో కూర్చుండబెట్టినపుడు దుస్తులద్వారా బ్యాక్టీరియా, వైరస్ వ్యాపిస్తుంది. అన్ని వ్యాధుల్లోనూ రేబిస్ అత్యంత ప్రమాదకరం. పిచ్చికుక్కలు మనుషులను, గేదెలను కరవటం పరిపాటిగా మారగా వీటిని నిర్మూలించేలా, వీధికుక్కలకు సైతం వ్యాక్సినేషన్ చేయాలి.

ఇవి పాటించాలి

జంతువులు, పక్షులవల్ల వైరస్, బ్యాక్టీరియా, పరాన్నజీవులు పరిసరాల్లోకి వ్యాపించి మానవుల్లో వ్యాధులకు కారణమవుతాయి. ఇటీవల కుక్కలను పెంచటం ఎక్కువైంది. పెంపుడు జంతువులున్నపుడు ఇంటి పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలి. కుక్కలను ఉంచే గదులు, కట్టివేసే ప్రాంతాలను కూడా శుభ్రంగా ఉంచాలి. పిల్లలు కుక్కలతో ఆడుకున్న వెంటనే స్నానం చేయించాలి లేదా చేతులను శుభ్రంగా కడగాలి. జంతువులు తిన్న ఆహార పదార్థాలను చిన్నపిల్లలు తినకుండా చూడాలి. జంతువులను ముట్టుకున్న తర్వాత పిల్లలు చేతులను నోట్లో పెట్టుకోకుండా చూడాలి. మనం తినే పదార్థాలను కుక్కలు, పిల్లులు తినకుండా చూడాలి. మనం తినే పళ్లేల్లోనూ అవి మూతి పెట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. పెంపుడు కుక్కలకు ప్రతి 6 మాసాలకోసారి తప్పనిసరిగా టీకాలను వేయించాలి. జబ్బుపడిన పశువుల పాలను తాగకూడదు. రోజూ మనం తాగే పాలను తప్పనిసరిగా మరిగించిన తర్వాతే తాగాలి. పశువైద్యులు, సిబ్బందిని సంప్రదించి వ్యాక్సినేషన్, వ్యాధుల నివారణ తదితరాలు వివరాలు తెలుసుకుని జూనోసిస్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

జూనోసిస్ డే..

ప్రముఖ శాస్త్రవేత్త లూయిస్‌పాశ్చర్ మొదటిసారిగా 1885, జూలై 6న పిచ్చికుక్క కాటుకు గురైన బాలుడికి నిరోధక టీకా ఇవ్వడం ద్వారా రేబిస్ వ్యాధి రాకుండా కాపాడగలిగాడు. దీంతో అప్పటి నుంచి ఏటా జూలై 6న జూనోసిస్ దినోత్సవం నిర్వహిస్తున్నారు.



భద్రాచలం పశువుల ఆస్పత్రిలో కుక్కకు వ్యాక్సిన్ వేస్తున్న ఉద్యోగి (ఫైల్)

జిల్లాలో పశుసంపద

మొత్తం పశువుల ఆస్పత్రులు:	80
నియోజకవర్గ ఆస్పత్రులు :	6
మండలస్థాయి ఆస్పత్రులు:	30
ఉప కేంద్రాలు:	44
బర్రెలు:	1,25,587
ఆవులు:	2,00,844
గొర్రెలు, మేకలు :	3,55,868

డీవార్మింగ్ చేయిస్తాం



మా ఇంట్లో రోబో అనే లాబ్రడర్ కుక్క ఉంది. దాని వయసు 11 ఏళ్లు. ఆరు నెలలకోసారి డాగ్స్‌కి పొట్ట క్లీన్ కావడానికి డీవార్మింగ్ చేస్తారు. పశువైద్యులను సంప్రదించి డీ వార్మింగ్ చేయిస్తాం. వీధి కుక్కలకు ఇలాంటిది లేకుండా బాగానే ఉంటాయి. అయితే తగిన జాగ్రత్తలు తీసుకుంటాం. –పాకాల దుర్గాప్రసాద్, జంతు ప్రేమికుడు, భద్రాచలం

వ్యాక్సినేషన్‌పై నిర్లక్ష్యం వద్దు



ఇంట్లో పెంచుకునే జంతువులకు క్రమం తప్పకుండా వ్యాక్సినేషన్ చేయించాలి. లేకపోతే జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉంది. ఈ వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండాలంటే రెగ్యులర్ వెటర్నరీ వైద్యుల సలహాలు తీసుకోవాలి. –డాక్టర్ రవీంద్రనాథ్ ఠాగూర్, భద్రాచలం ఇన్‌చార్జి ఏడీపీ

'పోడు పంపిణీ'లో నిరసన సెగ

- ఎమ్మెల్యే మెచ్చా సాక్షిగా తోపులాట
- నిరసనకారులపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే



ఎమ్మెల్యే మెచ్చాతో వాగ్వాదానికి దిగిన పోడు సాగుదారులు

చండ్రుగొండ : మండలంలో పోడు భూముల పట్టాల పంపిణీ కార్యక్రమం బుధవారం రసాభాసగా మారింది. రావికంపాడు, వెంకటియాతండా పంచాయతీల్లో పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్యేకు అడుగడుగునా పోడుదారుల నుంచి నిరసన సెగ తగిలింది. దశాబ్దాలుగా పోడు సేద్యం చేసుకుంటున్నా తమకు పట్టాలు రాలేదని అనేక మంది గిరిజన మహిళలు ఎమ్మెల్యే ఎదుట నిరసన తెలిపారు. ఎమ్మెల్యేపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో గ్రామస్థాయి అధికార పార్టీ నాయకులకు, పోడుదారులకు మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. పరస్పరం దుర్భాషలాడుకున్నారు. ఎమ్మెల్యే మెచ్చా సైతం పోడుదారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను కొందరు కావాలనే అడ్డుకుంటున్నారని, రెచ్చగొట్టి రగడ సృష్టించాలనుకోవడం సరికాదని పేర్కొన్నారు. రాజకీయాలు బయట చేసుకోవాలని హితవు పలికారు. ఘర్షణ వాతావరణం సృష్టించే వారిపై కేసులు నమోదు చేయాలని ఎమ్మెల్యే మెచ్చా సభావేదికపై నుంచి పోలీసులకు ఆదేశించారు. దీంతో నిరసన తెలుపుతున్న వారిని సభాస్థలి నుంచి పోలీసులు వెళ్లగొట్టే ప్రయత్నం చేశారు. పట్టాలు పొందే లబ్ధిదారుల కంటే పట్టాలు రానివారితోనే సభ నిండిపోవడంతో గందరగోళం నెలకొంది. ఈ క్రమంలో పట్టాలు పంపిణీ కార్యక్రమం త్వరితగతిన ముగించిన ఎమ్మెల్యే మెచ్చా వెనుదిరిగారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రేవతి, అధికారపార్టీ నాయకులు దార వెంకటేశ్వరరావు, ఉప్పతల ఏడుకొండలు, భూపతి శ్రీనివాసరావు, ఎస్డీ రసూల్, మెడా మోహన్‌రావు, గాదె శివప్రసాద్, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఆపన్నహస్తం అందించరూ..

- ప్రమాదంలో గాయపడి మంచానికి పరిమితమైన యువకుడు
- దాతలు ఆర్థికసాయం చేయాలని కుటుంబం వేడుకోలు

దీనగాథ

సుజాతనగర్: ఓ ప్రమాదం ఆ యువకుడి జీవితాన్ని నరకప్రాయం చేసింది. దీంతో కుటుంబానికి అండగా నిలవాల్సిన వయసులో మంచానికే పరిమితమయ్యాడు. చికిత్స చేయించేందుకు ఆర్థిక స్థోమతలేక దాతలు ఆదుకోవాలని వేడుకుంటున్నాడు. మండల పరిధిలోని రాఘవాపురం గ్రామానికి చెందిన గంధం జంపయ్య తాపీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. పక్షవాతం రావడందో కాలు, చేయి సచ్చుపడిపోయాయి. సుమారు ఆరు నెలల క్రితం గ్రామంలో జరిగిన ప్రమాదంలో జంపయ్య గాయపడ్డాడు. దీంతో అతడిని ఖమ్మం, కొత్తగూడెం పట్టణాలకు తరలించి చికిత్స అందించారు. ఆర్థిక స్థోమత లేక పూర్తిగా నయం కాకముందే ఆస్పత్రి నుంచి ఇంటికి తీసుకొచ్చారు. మెదనరాలు దెబ్బతిన్నాయని, ఆపరేషన్ చేయాలని వైద్యులు సూచించారు. అందుకయ్యే ఖర్చులు లేక కుటుంబం ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తోంది. ఇతనికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య స్రవంతి కూలి పనులు చేస్తూ భర్త, పిల్లలను పోషించుకుంటోంది. దాతలు స్పందించి ఆదుకోవాలని నిరుపేద దంపతులు వేడుకుంటున్నారు.



మంచానికి పరిమితమైన జంపయ్య

దాతలు ఆర్థికసాయం చేయాలనుకుంటే..

బ్యాంకు ఖాతా నంబర్ : 73126347267
ఏపీజీవీబీ, సుజాతనగర్ బ్రాంచ్
ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ : SBINORRAPGB
ఫోన్ నంబర్: 85220 88926

త్వరలోనే గిరిజనేతరులకు పోడు పట్టాలు

ప్రభుత్వ విప్ రేగా కాంతారావు

బూర్గంపాడు/అశ్వాపురం: తొందరలోనే గిరిజనేతరులకు కూడా పోడు పట్టాలు ఇచ్చేందుకు కసరత్తు జరుగుతోందని పినపాక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రేగా కాంతారావు తెలిపారు. బూర్గంపాడు మార్కెట్‌యార్డు ఆవరణలో బుధవారం మండలంని 1,836 మంది పోడు రైతులకు 5,714 ఎకరాలకు పట్టాలు పంపిణీ చేశారు. అశ్వాపురం మండలం మొండికుంటలోని కేవీఆర్ ఫంక్షన్ హాల్‌లో తహసీల్దార్ ఎం.ఏ.రాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండలంలోని 5,221 ఎకరాల పోడు భూములకు సంబంధించి 2,454 మందికి పోడు రైతులకు పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో కాంతారావు మాట్లాడుతూ గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన తాను పినపాక నియోజకవర్గంలోని పోడు రైతుల సమస్యల పరిష్కారం కోసమే బీఆర్‌ఎస్‌లో చేరానని తెలిపారు. నిన్నటి వరకు పోడు పట్టాలు రావని, స్వలాభం కోసమే పార్టీ మారానని విమర్శించిన విపక్షాల నాయకులు ఇప్పుడు సమాధానం చెప్పాలన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ బీఆర్‌ఎస్‌దే అధికారమని, అప్పుడు గిరి వికాసం పథకం ద్వారా పోడు భూముల్లో బోర్లు, విద్యుత్ సౌకర్యం, ల్యాండ్ లెవెలింగ్, ఫెన్సింగ్ వంటి పనులు చేపడతామన్నారు. కొందరు నాయకులు , కొన్ని పార్టీలు అమలుకాని హామీలు ఇచ్చి మోసగించేందుకు ముందుకు వస్తారని వారి మాటలను నమ్మవద్దని సూచించారు. అనంతరం రెండు మండలాల్లో పలువురికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. బూర్గంపాడు కార్యక్రమంలో తహసీల్దార్ బి.భగవాన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు కామిరెడ్డి శ్రీలత, మార్కెట్ కమిటీ చైర్మన్ పాడియం ముత్యాలమ్మ, సొసైటీ చైర్మన్ బిక్కసాని శ్రీనివాసరావు, రైతుబంధు సమితి మండల కన్వీనర్ బిజ్జం శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ వివేక్ రామ్, ఎంపీఓ సునీల్, ఏఓ శంకర్ పాల్గొన్నారు. అశ్వాపురం కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సూదిరెడ్డి సులక్షణ, రైతుబంధు సమితి అధ్యక్షుడు గజ్జల లక్ష్మారెడ్డి, ఆర్ఐలు రాజేశ్వరరావు, నాగమణి, సర్పంచ్‌లు పాయం భద్రయ్య, మర్రి మల్లారెడ్డి, ఏనిక స్వరూప, పర్శిక సూరిబాబు, కలేటి నరసింహారావు, పాయం భద్రమ్మ, మడకం సాధు, బండ్ల సంధ్యారాణి, కోడి కృష్ణవేణి, పాయం భద్రయ్య, చాప ఉమాదేవి, కుంజా రామారావు, వెంకటరమణ, కాకా అశోక్, పర్శిక రాజమ్మ, భూక్యా బుజ్జి పాల్గొన్నారు.



అశ్వాపురం: మొండికుంటలో గిరిజనులకు పోడు పట్టాలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ కాంతారావు



బూర్గంపాడు: మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ రేగా

సీహెచ్‌సీలో ముగ్గురికి మెమోలు జారీ

ఆస్పత్రిని సందర్శించి జిల్లా అదనపు కలెక్టర్

సాక్షి ఎఫెక్ట్..

అశ్వారావుపేటరూరల్: ఓ బాలికపై కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటనలో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు వైద్య సిబ్బందికి జిల్లా ఉన్నతాధికారులు మెమోలు జారీ చేశారు. మండలంలోని వినాయకపురం కాలనీ గ్రామానికి చెందిన పదేళ్ల బాలిక పురేటి లాలస సోమవారం కుక్క దాడిలో తీవ్రంగా గాయపడింది. దీంతో వైద్యం కోసం అశ్వారావుపేటలోని సీహెచ్‌సీకి రాగా కుక్క కరిచిన గాయాన్ని బాధితురాలి తండ్రి చిలకారావుతో శుభ్రం చేయించినట్లు ఆరోపించిన సంగతి తెలిసిందే. ఇదే విషయమై 'సాక్షి' దినపత్రికలో 'బాలికపై కుక్క దాడి' శీర్షికన కథనం ప్రచురితం కాగా, కలెక్టర్ అనుదీప్ విచారణకు ఆదేశించారు. దీంతో డీసీహెచ్‌వో డాక్టర్ రవిబాబు బాధ్యులైన సిబ్బందిని వివరణ ఇవ్వాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆస్పత్రి ఎంఎన్‌ఓ(మెయిన్ నర్సింగ్ స్టాఫ్)తోపాటు, ఆస్పత్రిలో 'ఇమ్యునోగ్లోబిలిన్'అనే ఇంజక్షన్ అందుబాటులో ఉంచుకోకపోవడంపై మరో ఇద్దరు ఫార్మసిస్టులకు మెమోలు జారీ చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు సీహెచ్‌సీని సందర్శించి వివరాలు ఆరా తీశారు. డయాలసిస్ సెంటర్‌ను పరిశీలించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న మరో ఇద్దరు నర్సింగ్ సిబ్బందిని డిప్యూటేషన్‌పై బదిలీ చేయనున్నట్లు సమాచారం. దీనిపై ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పూర్ణచంద్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. ముగ్గురికి మెమోలు జారీ చేసిన మాట వాస్తవమేనని తెలిపారు.



వివరాలు ఆరా తీస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ కర్నాటి వెంకటేశ్వర్లు

డయాలసిస్ సేవలు ప్రారంభం

ఇల్లెందు: ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలలో డయాలసిస్ సేవలు ఎట్టకేలకు ప్రారంభమయ్యాయి. బుధవారం తొలి కేసులో కటకం దయాకర్ అనే బాధితుడికి డయాలసిస్ చేయగా, వైద్యులు పర్యవేక్షించారు. ఇల్లెందు ఆస్పత్రిలో డయాలసిస్ సేవలు ప్రారంభించాలని ఏడాదికాలంలో 'సాక్షి'లో పలుమార్లు కథనాలు వెలువడ్డాయి. జాప్యానికి కారణాలతోపాటు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ లేకపోవడం వంటి సమస్యలను ఎత్తిచూపింది. చివరిసారిగా గత నెల 27న 'షురూకాని డయాలసిస్'శీర్షికన కథనం ప్రచురించింది. దీంతో వైద్యారోగ్యశాఖ అధికారులు స్పందించారు. విద్యుత్ శాఖ అధికారులు సత్వరమే విద్యుత్ ట్రాన్స్‌ఫారం ఏర్పాటు చేశారు. బుధవారం నుంచి డయాలసిస్ ప్రారంభించగా, బాధితులకు కొత్తగూడెం, ఖమ్మంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం తప్పిందని డీసీహెచ్‌ఎస్ రవిబాబు తెలిపారు. దీంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా సమాచారం అందుకున్న మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు బృందం ఆస్పత్రిలో డయాలసిస్ వార్డును సందర్శించి పరిశీలించారు. సూపరింటెండెంట్ డాక్టర్ శిరీష్‌కుమార్, ఆర్ఎంఓ డాక్టర్ హర్షవర్ధన్, ఇతర డాక్టర్లు, డయాలసిస్ సెంటర్ ఇన్‌చార్జ్ లెనిన్ పాల్గొని తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట సీహెచ్‌సీలో..

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట ప్రభుత్వ సామాజిక ఆస్పత్రిలో బుధవారం నుంచి డయాలసిస్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. కొద్ది రోజుల క్రితం ఆస్పత్రిలో కలెక్టర్ అనుదీప్, స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. మూత్ర పిండాల వ్యాధి తో బాధ పడుతున్న దమ్మపేటకు చెందిన సీహెచ్ శ్రీనివాస్ అనే బాధితుడికి ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పూర్ణ చంద్ పర్యవేక్షణలో బుధవారం డయాలసిస్ చేశారు. దీంతో ఈ ప్రాంత వాసులు ఖమ్మం, విజయవాడ, రాజమండ్రి వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరంలేకుండా పోయింది.



ఇల్లెందు: డయాలసిస్ యూనిట్‌లో వైద్యాధికారులు, ప్రజాప్రతినిధులు



అశ్వారావుపేట రూరల్: బాధితుడికి డయాలసిస్ చేస్తున్న వైద్య సిబ్బంది

నల్లా కనెక్షన్ కోసం ఫోరమ్‌లో కేసు, విజయం

కొణిజర్ల: నల్లా కనెక్షన్ విషయమై వినియోగదారుల ఫోరంను ఆశ్రయించిన వ్యక్తి విజయం సాధించాడు. కొణిజర్లకు చెందిన పి.అప్పారావు నల్లా కనెక్షన్ పెట్టించుకోగా పంచాయతీ అనుమతి లేదంటూ తొలగించారు. దీంతో ఆయన అప్పారావు మండల, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన రాలేదు. చివరకు జిల్లా వినియోగదారుల ఫోరంను ఆశ్రయించగా, ఫోరం ఆదేశాల మేరకు మంగళవారం పంచాయతీ సిబ్బంది కనెక్షన్‌ను పునరుద్ధరించారు.

మొలకెత్తని వరి విత్తనాలు

కూసుమంచి: నాసిరకం విత్తనాల కారణంగానే వరి నారు మొలకెత్తలేదని మండలంలోని హట్యాతండాకు చెందిన చైతు శంకర్ ఆరోపించారు. వారం క్రితం ఆయన కూసుమంచిలో వరి విత్తనాలు కొనుగోలు చేసి నారు పోశాడు. అయితే, బుధవారం వరకు మొలకెత్తకపోవడంతో ఏఓకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై ఏఓ వాణిని వివరణ కోరగా విచారణ జరిపి విత్తనలోపం ఉంటే బాధ్యులపై చర్యలు తీసుకుని రైతుకు న్యాయం చేస్తామని తెలిపారు.

యువకుడి మృతదేహం లభ్యం

దుమ్ముగూడెం: మండలంలోని సీతారాంపురం సమీపంలో గోదావరి నదిలో గల్లంతైన యువకుడి మృతదేహం బుధవారం లభ్యమైంది. సీతారాంపురం సమీపంలోని రామారావుపేటకు చెందిన కంగాల సాగర్ (22) మంగళవారం మధ్యాహ్నం స్నేహితులతో కలిసి గోదావరి నదిలో ఈత కొట్టేందుకు దిగి స్నానం చేస్తుండగా లోతు తెలియక మునిగిపోయాడు. స్నేహితుల సమాచారంతో గ్రామస్తులు, పోలీసులు గాలింపు చేపట్టారు. దీంతో బుధవారం ఉదయం మృతదేహాన్ని లభ్యమైంది. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నర్సిరెడ్డి తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా : ఒకరికి గాయాలు

అశ్వాపురం: మండల పరిధిలోని అమెర్ద కాలనీ గ్రామ శివారులో బుధవారం రాత్రి డోజర్ ట్రాక్టర్ బోల్తా పడి ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. అమెర్ద–అమ్మగారిపల్లి గ్రామాల మధ్య జిన్నెలవాగు సమీపంలో కట్టపై డోజర్ ట్రాక్టర్‌తో చదును చేసే పనులు జరుగుతున్నాయి. ఈ పనుల వద్ద అమెర్ద కాలనీ గ్రామానికి చెందిన కాశిమల్ల రఘు సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి కట్టపై ఉన్న ట్రాక్టర్‌ను నడుపుతుండగా అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో రఘు తలకు బలమైన గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం భద్రాచలం ఏరియా ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

ఆలయంలో చోరీ

జూలూరుపాడు: మండలంలోని పాపకొల్లు శ్రీ కోటమైసమ్మతల్లి ఆలయంలోని హుండీని గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి చోరీకి పాల్పడిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. దుండగులు ఆలయం ప్రధాన గేటు తాళం పగులగొట్టి, లోపలికి ప్రవేశించి హుండీ తాళం పగులగొట్టి సుమారు రూ.3,500 నగదును ఎత్తుకెళ్లారు. బుధవారం ఉదయం ఆలయాన్ని శుభ్రం చేసేందుకు వెళ్లిన స్వీపర్ గమనించి ఈఓ శేషయ్యకు సమాచారం ఇవ్వగా, ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్సై పోటు గణేష్ ఆలయాన్ని సందర్శించి, వివరాలు సేకరించారు. గతంలో కూడా పలుమార్లు ఇదే ఆలయంలో చోరీ జరగడం గమనార్హం.

ప్రభుత్వ ఉద్యోగిపై కేసు నమోదు?

దమ్మపేట: ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా, రోడ్డుపై జయంతి వేడుకలు నిర్వహించిన ప్రభుత్వ ఉద్యోగితో పాటు మరో ఆరుగురిపై మంగళవారం అర్ధరాత్రి పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం. మంగళవారం సాయంత్రం మండలంలో పశు వైద్యాధికారిగా పనిచేస్తున్న మన్యం రమేష్, మరికొందరు మందలపల్లి గ్రామంలో రోడ్డుపై గుమిగూడారు. రోడ్డుపై నిర్లక్ష్య ధోరణితో ప్రజా వాహనాలకు విఘాతం కలిగేలా, ఓ నాయకుడి జయంతి నిర్వహించారు. ఈ ఘటనలో పశు వైద్యాధికారితోపాటు మరో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలుస్తోంది.

నలుగురిపై..

పాల్వంచరూరల్: ప్లాంటేషన్‌లోని మొక్కలు నరికిన నలుగురు వ్యక్తులపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని దంతలబోరు గ్రామ శివారు 269 కంపార్ట్‌మెంట్ ప్లాంటేషన్‌లో మంగళవారం 15 వందల మొక్కలను దంతలబోరు గ్రామానికి చెందిన కంటే శేషు, కంటే ధనమ్మ, మల్లయ్య, జంగిటి వెంకట్రావు నరికారు. దీంతో బీట్ ఆఫీసర్ వర్స శ్రీలత ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.



అమరుల స్మారకానికి మరిన్ని మెరుగులు

త్వరలో దుబాయ్ నుంచి రానున్న నిపుణులు

సాక్షి, హైదరాబాద్: ఇటీవలే కొత్తగా ప్రారంభమైన తెలంగాణ అమరవీరుల స్మారకానికి మరిన్ని మెరుగులు దిద్దేందుకు దుబాయ్ నుంచి త్వరలో నిపుణులు రాబోతున్నారు. ప్రధాన కాంక్రీట్ నిర్మాణం తర్వాత బయటి భాగాన్ని ప్రత్యేక జర్మన్ తయారీ స్టెయిన్‌లెస్ స్టీల్‌తో రూపొందించిన విషయం తెలిసిందే. స్టీల్ షీట్లను ప్రత్యేక పద్ధతిలో అతికించి రూపొందించారు. ఇందుకు ఆధునిక పరిజ్ఞానాన్ని వాడి అతుకులు కనిపించకుండా, మొత్తం ఒకే స్టీలు రేకుతో రూపొందించినట్టుగా మార్చారు. భవనాన్ని ప్రారంభించే హడావుడిలో ఈ అతుకులను జాయింట్ చేసే పని పూర్తిస్థాయిలో చేయలేదు. ఇప్పటికీ చాలా ప్రాంతాల్లో అతుకులు కనిపిస్తున్నాయి. వాటిని సరిచేయించాలని నిర్ణయించారు. ఇందుకోసం దుబాయ్ నుంచి నిపుణులు రాబోతున్నారు.

దుబాయ్ నుంచే ఎందుకు?

ఈ ప్రత్యేక స్టెయిన్‌లెస్ స్టీల్‌ను జర్మనీ కంపెనీ నుంచి కొన్నారు. కానీ, దాన్ని ప్రీకాస్ట్ చేసే పని దుబాయ్ కంపెనీకి అప్పగించారు. ఆ పరిజ్ఞానం స్థానికంగా లేకపోవటంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దుబాయ్‌లో ప్రీకాస్ట్ చేసిన తర్వాత, వాటిని ముక్కలు చేసి హైదరాబాద్‌కు తెచ్చి అప్పట్లో బిగించారు. ఇప్పుడు అతుకులు కనిపించకుండా చేయటం, సొట్టలు పూడ్చటం కూడా స్థానిక నిపుణులు చేయలేనందున దుబాయ్ నుంచి పిలిపిస్తున్నారు.

నిర్వహణ బాధ్యత పురపాలక శాఖకు..

తెలంగాణ అమరవీరుల స్మారక భవనం నిర్వహణ బాధ్యతను పురపాలక శాఖకు అప్పగిస్తున్నారు. ఈ మేరకు రోడ్లు భవనాల శాఖ లేఖ రాసింది. నిర్మాణం, తదనంతర పనులు పూర్తవుతున్నందున నిర్వహణ బాధ్యత తీసుకోవాల్సిందిగా అందులో సూచించింది. గతంలో ఆ ప్రాంగణంలో ఉన్న లుంబినీ పార్కును హెచ్ఎండీఏ నిర్వహించింది. ఇప్పుడు దీని నిర్వహణ కూడా ఆ సంస్థకే అప్పగించనున్నారు. భవిష్యత్తులో మళ్లీ మరమ్మతులు చేయాల్సి వస్తే తాము చూస్తామని అ లేఖలో పేర్కొన్నారు. ఇక, ఎన్టీఆర్ గార్డెన్స్ పక్కన ఏర్పాటు చేసిన అంబేడ్కర్ భారీ విగ్రహ నిర్వహణ బాధ్యత చూడాల్సిందిగా ఎస్సీ అభివృద్ధి శాఖకు మరో లేఖ రాశారు. దాని వ్యయాన్ని ఆ శాఖనే భరించినందున నిర్వహణ కోసం లేఖ రాశారు.

త్వరితగతిన పోలవరం

పూర్తయ్యేలా చూడాలని ప్రధాని మోదీకి సీఎం జగన్ వినతి

- రూ.55,548.87 కోట్లకు ఆమోదించండి
- తొలి దశ నిర్మాణానికి రూ.17,144 కోట్లు..
- వైఎస్సార్ జిల్లాలో స్టీల్ ప్లాంట్‌కు గనుల కేటాయింపు..
- నూతన వైద్య కళాశాలలకు సహకారం
- రాష్ట్రాభివృద్ధికి సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని వినతి
- హోం మంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్‌తోనూ సమావేశం



కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏపీ సీఎం వైఎస్ జగన్

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి విభజన హామీలు సహా అపరిష్కృతంగా ఉన్న అంశాలపై దృష్టి పెట్టాలని ప్రధాని నరేంద్ర మోదీకి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. పోలవరం ప్రాజెక్టు, జాతీయ ఆహార భద్రత చట్టం అమల్లో హేతుబద్ధత, విభజన సమయంలో రాష్ట్రానికి ఇచ్చిన హామీలు, నూతన వైద్య కళాశాలలకు ఆర్థిక సాయం తదితర అంశాలపై ప్రధానితో సుమారు గంటా ఇరవై నిమిషాలపాటు సుదీర్ఘంగా చర్చించారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని విన్నవించారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ప్రత్యేక హోదా ఎంతో దోహద పడుతుందని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ వ్యయం రూ.55,548.87 కోట్లకు ఆమోదం తెలపాలని, సుదీర్ఘ కాలంగా ఇది పెండింగ్‌లో ఉందని ప్రధాని నరేంద్రమోదీకి గుర్తు చేశారు. ప్రాజెక్టు పనులు వేగవంతం చేయడానికి తొలి దశ నిర్మాణానికి రూ.17,144 కోట్లు అవసరం అవుతుందని, ఇది కేంద్ర జల శక్తి శాఖ పరిశీలనలో ఉందని వివరించారు. తొలి దశ నిర్మాణానికి, కేంద్ర ఆర్థిక శాఖ ఇప్పటికే రూ.1,2911.15 కోట్ల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని, అయితే తొలి దశలో భాగంగా మరో 36 గ్రామాల్లోని నిర్వాసితులకు సహాయ, పునరావాసం ప్యాకేజీ ఇవ్వాల్సి ఉందని చెప్పారు. ఇది ఇస్తేనే తొలి దశ పూర్తవుతుందని వివరించారు. మొత్తంగా పోలవరం తొలి దశ నిర్మాణానికి రూ.17,144 కోట్లు ఇచ్చేలా జల శక్తి శాఖకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిన తన సొంత నిధులు రూ.1,310.15 కోట్లను వెంటనే రీయింబర్స్ చేయాలని, ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేయడానికి ఆయా అంశాలపై దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఇంకా ప్రధాని దృష్టికి సీఎం తీసుకెళ్లిన అంశాల వివరాలు ఇలా ఉన్నాయి.

సుదీర్ఘ కాలంగా బకాయిలు

- 2014 జూన్ నుంచి 2017 జూన్ వరకు తెలంగాణ రాష్ట్రానికి సరఫరా చేసిన విద్యుత్తుకు సంబంధించి ఏపీకి రావాల్సిన రూ.7,230.14 కోట్ల బకాయిలు ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయి. ఏపీ జెన్‌కో ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా అవి త్వరగా వచ్చేలా చూడాలి.
- జాతీయ ఆహార భద్రతా చట్టం అమల్లో హేతుబద్ధత లోపించడంతో ఏపీ కన్నా ఆర్థికంగా ముందు వరుసలో ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాలకు అధిక శాతం కవరేజీ ఉంది. ఈ పథకం అమలుకు ఎంచుకున్న ప్రమాణాల్లో హేతుబద్ధత లేదని నీతి ఆయోగ్ కూడా నిర్ధారించింది.
- హేతుబద్ధత లేనందున రాష్ట్రంలో 56 లక్షల కుటుంబాలకు కేంద్రం రేషన్ దక్కడం లేదు. దీనివల్ల రాష్ట్ర ఖజానాపై ఏటా రూ.5,527 కోట్ల భారం పడుతోంది. ప్రతినెలా వినియోగించకుండా దాదాపు లక్ష టన్నుల బియ్యం కేంద్రం వద్ద ఉంటున్నాయి. ఇందులో 77 వేల టన్నులు రాష్ట్రానికి ఇస్తే సరిపోతుంది. దీనిపై మీరు (ప్రధాని) సత్వరమే జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.
- ఏపీ పౌర సరఫరాల శాఖకు దీర్ఘకాలంగా (2012–13 నుంచి 2017–18 వరకు) పెండింగులో ఉన్న సబ్సిడీ బకాయిలు రూ.1,702.90 కోట్లను మంజూరు చేయాలి.

విభజన హామీలు నెరవేర్చండి

- రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రత్యేక హోదా సహా పార్లమెంటు సాక్షిగా ఇచ్చిన హామీలపై దృష్టి పెట్టాలి. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి, ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ప్రత్యేక హోదా దోహద పడటం ద్వారా రాష్ట్రం స్వయం సమృద్ధి దిశగా ముందుకు అడుగులు వేస్తుంది. అందువల్ల ఈ విషయంలో సానుకూల నిర్ణయం తీసుకోవాలి.
- వైఎస్సార్ జిల్లాలో స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి రాష్ట్ర విభజన సందర్భంలో కేంద్రం హామీ ఇచ్చింది. వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలో జీవనోపాధి మెరుగుపడడానికి, జీవన ప్రమాణాలు పెంచడానికి ఈ ప్రాజెక్టు చాలా అవసరం. స్టీల్ ప్లాంట్‌కు అత్యంత అవసరమైన ముడి ఖనిజం కోసం మూడు గనులను ఏపీఎండీసీకి కేటాయించేలా కేంద్ర గనుల శాఖకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతున్నాం.
- రాష్ట్రంలో 13 జిల్లాలను 26 జిల్లాలుగా చేశాం. ప్రతి జిల్లాకు కనీసంగా 18 లక్షల జనాభా ఉంది. ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలు అందించేందుకు గతంలో ఉన్న 11 మెడికల్ కాలేజీలకు తోడు అదనంగా మరో 17 కళాశాలల నిర్మాణాలు చేపట్టాం. వీటికి తగిన ఆర్థిక సహాయం చేయాలి.
- సీఎం వైఎస్ జగన్.. ప్రధానితో భేటీకి ముందు కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో సుమారు 45 నిమిషాలపాటు, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో పలు అంశాలపై చర్చించి, రాష్ట్రానికి సహకరించాలని కోరారు. కాగా, ఉదయం ఢిల్లీ విమానాశ్రయంలో సీఎంకు వైఎస్సార్‌సీపీ ఎంపీలు విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డి, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, రెడ్డెప్ప, ఆర్.కృష్ణయ్య, తలారి రంగయ్య, చింతా అనూరాధ తదితరులు ఘన స్వాగతం పలికారు. బుధవారం రాత్రి పర్యటన ముగించుకుని తిరిగి తాడేపల్లికి బయల్దేరారు.

నిరుపేదలకు భూమి

పదేళ్ల తర్వాత ఏపీలో పంపిణీకి సన్నాహాలు

సాక్షి, అమరావతి: సుదీర్ఘకాలం తర్వాత ఏపీలో నిరుపేదలకు వైఎస్ జగన్ ప్రభుత్వం వ్యవసాయ భూములు పంపిణీ చేయనుంది. 23 జిల్లాల్లో 54 వేల ఎకరాలను అర్హులైన పేదలకు పంచేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇందుకోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల్లో అర్హులైన సుమారు 47 వేల మంది లబ్ధిదారులను ఎంపిక చేసింది. ఆయా జిల్లాల అసైన్‌మెంట్ కమిటీల ఆమోదం కూడా దాదాపు పూర్తయింది. భూమి లభ్యతను బట్టి ఒక్కో లబ్ధిదారునికి ఒకటి నుంచి ఒకటిన్నర ఎకరం వరకు భూమి ఇవ్వనున్నారు. గ్రామాల్లో నిరుపేదలకు వ్యవసాయ భూములు ఇవ్వాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ ఏడాది కిందటే కసరత్తు మొదలుపెట్టారు. అన్ని జిల్లాల్లో పేదలకు ఇవ్వడానికి అందుబాటులో ఉన్న భూమి, అర్హులైన లబ్ధిదారుల వివరాలతో నివేదికలు ఇవ్వాలని కలెక్టర్లను ఆదేశించారు. కలెక్టర్ల పరిశీలన తర్వాత 23 జిల్లాల్లోనే భూమి అందుబాటులో ఉన్నట్లు తేలింది. వైఎస్సార్, శ్రీ సత్యసాయి జిల్లాల్లో ఆశాజనకంగా భూమి అందుబాటులో ఉండగా, మరో 8 జిల్లాల్లో వెయ్యి నుంచి 4 వేల ఎకరాల లోపు భూమి లభ్యత ఉన్నట్లు నిర్ధారణ అయింది. మరో 9 జిల్లాల్లో వెయ్యి నుంచి 2 వేల ఎకరాల భూమి ఉండగా, 4 జిల్లాల్లో వెయ్యి ఎకరాల లోపు భూమి అందుబాటులో ఉన్నట్లు కలెక్టర్లు నివేదికలు ఇచ్చారు. విశాఖ, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి జిల్లాల్లో భూమి అందుబాటులో లేదు. త్వరలో మంత్రివర్గం భూ పంపిణీకి ఆమోదముద్ర వేసే అవకాశం ఉంది. రాష్ట్రంలో చివరిసారిగా 2013లో భూ పంపిణీ జరిగింది.

సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా జస్టిస్ భూయాన్, జస్టిస్ ఎస్వీ భట్టి

▶ మొదటి పేజీ తరువాయి

సిఫార్సు చేసింది. సుప్రీంకోర్టులో మూడు న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిని భర్తీ చేయాల్సి ఉండడంతో కొలీజియం ఇటీవల సమావేశమైంది. కేరళ సీజే ఎస్.వెంకటనారాయణ భట్టి, తెలంగాణ సీజే జస్టిస్ ఉజ్జల్ భుయాన్ పేర్లను కొలీజియం ఏకగ్రీవంగా సిఫార్సు చేసినట్లు సుప్రీంకోర్టు బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. హైకోర్టులో ప్రధాన న్యాయమూర్తులుగా సీనియారిటీ, మెరిట్, పనితీరు వంటి అంశాలతోపాటు హైకోర్టుల ప్రాతినిధ్యం, అట్టడుగు వర్గాలు, సమాజంలో వెనకబడిన వర్గాలు, లింగ వైవిధ్యం, మైనారిటీల ప్రాతినిధ్యం వంటివి మూల్యాంకనం చేసి ఈ ఇద్దరు న్యాయమూర్తులను సిఫార్సు చేసినట్లు పేర్కొంది. 2022 ఆగస్టు నుంచి సుప్రీంకోర్టులో ఏపీకి ప్రాతినిధ్యం లేదు. ఈ నేపథ్యంలో మాతృ హైకోర్టు అయిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రస్తుత న్యాయమూర్తుల్లో సీనియర్ అయిన జస్టిస్ భట్టిని సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమించాలని కొలీజియం సిఫార్సు చేసింది.

సమగ్రత, సామర్థ్యం ఉన్న జస్టిస్ భుయాన్

తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్న జస్టిస్ ఉజ్జల్ భుయాన్ చట్టంలోని విభిన్న అంశాలపై అనుభవం సంపాదించారని సుప్రీంకోర్టు కొలీజియం పేర్కొంది. లా ఆఫ్ టాక్సేషన్‌లో ఆయన ఎంతో నైపుణ్యం ఉన్నవారని తెలిపింది. బొంబాయి హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేసిన సమయంలో ట్యాక్సేషన్ సహా పలు కేసులు సమర్థంగా డీల్ చేసిన ఆయన సమగ్రత, సామర్థ్యం ఉన్న న్యాయమూర్తి అని పేర్కొంది. జస్టిస్ భుయాన్ 2011 అక్టోబరు 17న గౌహతి హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

జస్టిస్ భట్టి అనుభవం అపారం

ఏపీ, కేరళ హైకోర్టుల్లో సుదీర్ఘకాలం పనిచేసిన జస్టిస్ భట్టి చట్టంలోని పలు అంశాలపై అపార అనుభవం సంపాదించారని సుప్రీంకోర్టు కొలీజియం పేర్కొంది. జస్టిస్ భట్టి తీర్పులే ఆయన న్యాయపరమైన యోగ్యతకు నిదర్శనమని తెలిపింది. జస్టిస్ భట్టి జ్ఞానం, అనుభవం సుప్రీంకోర్టుకు అదనపు విలువ అందిస్తాయని పేర్కొంది. జస్టిస్ ఎస్.వి.భట్టి 1962 మే 6న చిత్తూరు జిల్లా మదనపల్లెలో జన్మించారు. తల్లిదండ్రులు రామకృష్ణయ్య, అన్నపూర్ణమ్మ. మదనపల్లెలోని గిరిరావు థియోసాఫికల్ హైస్కూల్‌లో ప్రాథమిక విద్యాభ్యాసం చేసిన ఆయన బీసెంట్ థియోసాఫికల్ కాలేజీలో డిగ్రీ పూర్తిచేశారు. బెంగళూరులోని జగద్గురు రేణుకాచార్య కాలేజీ నుంచి లా డిగ్రీ పొంది, 1987లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యారు. ఇ.కళ్యాణ్‌రామ్ వద్ద న్యాయవాదిగా వృత్తి జీవితాన్ని ప్రారంభించారు. హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, బీహెచ్ఈఎల్, బీఈఎల్, బీహెచ్‌పీవీ, ఆర్ఎస్‌వీపీ, నేషనల్ మారిటైం యూనివర్సిటీలకు న్యాయవాదిగా వ్యవహరించారు. 2000 నుంచి 2003 వరకు ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాదిగా అప్పటి అడ్వొకేట్ జనరల్‌కు సహాయ సహకారాలు అందించారు. 2013 ఏప్రిల్ 12న అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. 2014లో ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. హైకోర్టు విభజన తరువాత ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తిగా 2019లో ప్రమాణం చేశారు. అదే ఏడాది జస్టిస్ భట్టిని కేరళ హైకోర్టుకు బదిలీ చేస్తూ అప్పటి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్, న్యాయమూర్తులు జస్టిస్ సిక్రీ, జస్టిస్ బాబ్డే, జస్టిస్ ఎన్.వి.రమణ, జస్టిస్ అరుణమిశ్రాలతో కూడిన కొలీజియం నిర్ణయం తీసుకుంది. అప్పటి నుంచి కేరళ హైకోర్టు న్యాయమూర్తిగా కొనసాగుతున్న ఆయన ఈ ఏడాది ఏప్రిల్ 24న కేరళ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా, జూన్ 1న పూర్తిస్థాయి ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

సీఐడీ విచారణకు రామోజీ, శైలజా కిరణ్ డుమ్మా

సాక్షి, అమరావతి/నగరంపాలెం (గుంటూరు వెస్ట్): మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆర్థిక అక్రమాల కేసులో ప్రధాన నిందితుడు చెరుకూరి రామోజీరావు, ఏ–2 శైలజాకిరణ్ బుధవారం సీఐడీ విచారణకు డుమ్మా కొట్టారు. కాగా.. ఈ కేసులో ఏ–3గా ఉన్న మార్గదర్శి చిట్‌ఫండ్స్ 7 బ్రాంచ్ కార్యాలయాల మేనేజర్లు గుంటూరులోని సీఐడీ ప్రాంతీయ కా ర్యాలయంలో విచారణకు హాజరయ్యారు. చందా దారుల నిధులను మళ్లించామని, ఇదంతా తమ ప్రధాన కార్యాలయం ఆదేశాలతోనే చేశామని వారు సీఐడీ విచారణలో వెల్లడించినట్టు సమాచారం. తమ సంస్థలో చాలా ఏళ్లుగా చేస్తున్నట్టుగానే తాము కూడా చేశామని.. అందులో తాము కేవలం పాత్ర ధారులమేనని.. పూర్తి నిర్ణయాధికారం తమ ప్రధాన కార్యాలయానిదేనని స్పష్టం చేసినట్టు సమాచారం.

జిల్లా వార్తలు


సాయిబాబా ఆలయానికి భారీ విరాళం



ఆలయ కమిటీకి విరాళం అందజేస్తున్న దాతలు

భద్రాచలంటౌన్: భద్రాచలం జూనియర్ కళాశాల సెంటర్‌లోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయానికి ఓ భక్తుడు బుధవారం భారీ విరాళం అందజేశాడు. ఉద్యోగరీత్యా అమెరికాలో స్థిరపడిన పట్టణానికి చెందిన వడ్లమూడి సింధు – వినయ్‌కుమార్ దంపతులు వారి కుటుంబ సభ్యులు అబ్బినేని రామచంద్రారావు, పొట్లూరి వెంకటేశ్వర ప్రసాద్ జ్ఞాపకార్థం రూ.3.21 లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఈమేరకు సాయిబాబాను దర్శించుకున్న వారు ఆలయ కమిటీ అధ్యక్షుడు తుమ్మలపల్లి సత్యనారాయణమూర్తికి విరాళం అందజేయగా సన్మానించారు.

పెదవాగు ప్రాజెక్ట్‌లో ప్రవాహ నమోదు పరికరాలు



ప్రాజెక్ట్ వాటర్ సంప్‌పై అమర్చిన పరికరాలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని గుమ్మడవల్లి వద్ద ఉన్న పెదవాగు ప్రాజెక్ట్‌లో వరద నీటి ప్రవాహాన్ని నమోదు చేసేందుకు బుధవారం పరికరాలు బిగించారు. వర్షాకాలంలో ఎగువ ప్రాంతాల వాగుల ద్వారా ప్రాజెక్ట్‌లోకి ఎంత మేర వరద నీరు వస్తోందో గుర్తించేందుకు గాను ఆటోమేటిక్ వాటర్ లెవల్ రికార్డర్, ఈ దృశ్యాలను రికార్డు చేసేందుకు సీసీ కెమెరాలను అమర్చారు. వీటి ద్వారా అందే సమాచారంతో దిగువ ప్రాంతాల్లో ప్రమాదాలను నివారణకు అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. ఇలాంటి పరికరాలను గత నెలలో అశ్వారావుపేట మండలం కుడుముల పాడు వాగు వద్ద కూడా ఏర్పాటుచేసిన విషయం విదితమే.

సమ్మెబాటలో పంచాయతీ కార్మికులు

- నేటి నుంచి గ్రామాల్లో విధులు బహిష్కరణ
- సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ఆందోళనలు
- ఉమ్మడి జిల్లాలో 3,932 మంది సిబ్బంది
- సమ్మెతో పారిశుద్ధ్య నిర్వహణ, ఇతర పనులపై ప్రభావం చూపే అవకాశం



విధుల్లో నిమగ్నమైన పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు (ఫైల్)

చుంచుపల్లి/ఇల్లెందు రూరల్: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులతో పాటు ఇతర విధులు నిర్వర్తించే పంచాయతీ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం సమ్మెకు సిద్ధమయ్యారు. ఏళ్లుగా పనిచేస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించడమే కాక కనీస వేతనాలు అమలుచేయాలని, అర్హులకు ఉద్యోగోన్నతి కల్పించాలనే తదితర డిమాండ్లతో గురువారం నుంచి వారు సమ్మెకు దిగనున్నారు. పలుమార్లు అటు ప్రభుత్వం, ఇటు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితంలేక సమ్మె బాట పట్టాల్సి వచ్చిందని వారు చెబుతున్నారు. కాగా, పంచాయతీ కార్మికుల సమ్మెకు సీఐటీయూ, ఏఐటీయూసీ, ఇఫ్టూ, బీఆర్ఎస్‌కేవీ, టీజీకేబీయూ వంటి కార్మిక సంఘాలు మద్దతు ప్రకటించాయి.

కీలకమైన పనుల్లో...

ఖమ్మం జిల్లాలో 549 జీపీలకు గాను 2,280 మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 481 గ్రామపంచాయతీలకు గాను 1,652 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. పెద్ద జీపీల్లో పది నుంచి 15 మంది, చిన్న జీపీల్లోనైతే నలుగురు నుంచి ఆరుగురు చొప్పున విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిని మల్టీపర్పస్ వర్కర్లుగా పిలుస్తుండగా, చెత్తాచెదారం తొలగింపు, డ్రెయినేజీల నిర్వహణ, హరితహారం మొక్కలు, ప్రభుత్వ పాఠశాల పరిశుభ్రత, ఇంటింటికి చెత్త సేకరణ, విద్యుద్దీపాలు, తాగునీటి సరఫరా, ఇంటి పన్నులు వసూలు వంటి విధులు నిర్వహిస్తున్నారు. వీరికి ప్రభుత్వం రూ.9,500 చొప్పున, మేజర్ పంచాయతీల్లో రూ.12 వేల చొప్పున చెల్లిస్తున్నారు. కాగా, ఉదయం నుంచి రాత్రి వరకు పని భారంతో సమతమతమవుతున్నాయని సిబ్బంది వాపోతున్నారు. ఇక ట్రాక్టర్ల డ్రైవర్లుగా కూడా తమతోనే పని చేయిస్తుండడం, విద్యుత్ లైట్ల మరమ్మతు పనులతో ప్రమాదాలు జరుగుతున్నాయని చెబుతున్నారు. అయితే, కనీస వేతనం అమలుచేయడంతో పాటు ఇతర సమస్యల పరిష్కారానికి గురువారం నుంచి సమ్మెకు దిగుతుండగా... పనులు స్తంభించే అవకాశముందని తెలుస్తోంది. కానీ అధికారులు మాత్రం సమ్మె ప్రభావం పడకుండా ప్రత్యామ్నాయ చర్యలకు దిగుతున్నట్టు తెలిసింది.

17 డిమాండ్లతో సమ్మె నోటీసు

గ్రామపంచాయతీల సిబ్బంది జేఏసీగా ఏర్పడి ఉద్యమానికి తెరతీశాయి. ప్రధానంగా 17 డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచి పరిష్కరించాలని విజ్ఞప్తి చేశాయి. గ్రామపంచాయతీ సిబ్బందిని పర్మనెంట్ చేయాలని, పీఆర్‌సీలో నిర్ణయించిన బేసిక్ ప్రకారం రూ.19వేలు వేతనంగా చెల్లించాలని, ఆలోపు జీఓ నెం.60లో పేర్కొన్న వేతనాలను కేటగిరీల వారీగా అమలుచేయాలని కోరుతున్నారు. అలాగే, కారోబార్, బిల్ కలెక్టర్లకు అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి కల్పించాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేసి పాత పద్ధతిలోనే కేటగిరీలను యథావిధిగా కొనసాగించాలని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

డిమాండ్లు పరిష్కరించాలని సమ్మె



ప్రజాసేవలో నిమగ్నమవుతున్న మమ్ముల్ని ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అనేక సార్లు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. దీంతో సమ్మె ద్వారానే సమస్యలు సాధించుకోవాలని నిర్ణయించాం. రోజువారీగా నిరసనలతో సమ్మె కొనసాగిస్తాం.

– దుంపల అమర్‌నాథ్, జీపీ వర్కర్ల జేఏసీ జిల్లా కోకన్వీనర్

అర్హులందరికీ పదోన్నతి కల్పించాలి



ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు గ్రామపంచాయతీల్లో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న వర్కర్లకు కార్యదర్శులుగా పదోన్నతి కల్పించాలి. గుమస్తాలు, బిల్ కలెక్టర్లకు అసిస్టెంట్ పంచాయతీ కార్యదర్శిగా గుర్తింపు ఇవ్వాలి. అలాగే, కనీస వేతనాలు చెల్లించాలి.

– తొగర సామేలు, జేఏసీ కన్వీనర్, ఇల్లెందు మండలం

స్పందించకపోవడంతోనే సమ్మె



కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఇప్పటికే పలుమార్లు ఆందోళనలు చేసి ప్రభుత్వానికి విన్నవించాం. అలాగే, ఉన్నతాధికారులకు కూడా కలిశాం. అయినా స్పందన లేకపోవడంతోనే సమ్మెకు దిగాల్సి వస్తుంది. ఇకనైనా ప్రభుత్వం మా సమస్యలను పట్టించుకోవాలి.

– జటంగి వెంకన్న, జీపీ వర్కర్ల జేఏసీ జిల్లా కోకన్వీనర్

రెండు రాష్ట్రాల స్థాయి పురోహితుల క్రికెట్ టోర్నీ ప్రారంభం

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని స్తంభాద్రి పురోహితుల సంఘం ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల స్థాయి పురోహితుల క్రికెట్ పోటీలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఈ పోటీలను డాక్టర్ కూరపాటి ప్రదీప్‌కుమార్, బ్రాహ్మణ సంఘం నాయకులు వనం కృష్ణవేణి, సీతారామశాస్త్రి, శ్రీధర్‌శర్మ ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం పూజల్లో నిమగ్నమయ్యే పురోహితుల కోసం పోటీలు ఏర్పాటుచేయడం మంచి పరిణామమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.డీ.మతిన్, ఓలేటి సాంబమూర్తితో పాటు నిర్వాహకులు సంతోష్‌శర్మ, సాయినాథ్‌శర్మ, ప్రశాంత్‌శర్మ, దిలీప్‌శర్మ, అనిరుధ్‌శర్మ, శ్రీధర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మోపిదేవి విజయవాడ – అఘశాయ జట్ల నడుమ జరిగిన మ్యాచ్‌లో అఘశాయ జట్టు ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. కాగా, టోర్నీలకు 16 జట్లు హాజరుకాగా, ఈనెల 10వ తేదీ వరకు పోటీలు జరుగుతాయని నిర్వాహకులు వెల్లడించారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రదీప్‌కుమార్, నిర్వాహకులు

తక్కువ వడ్డీరేటుతో గృహరుణాలు


బిల్డర్ల సదస్సులో ఏపీజీవీబీ చైర్మన్ ప్రతాపరెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న ఏపీజీవీబీ చైర్మన్ ప్రతాపరెడ్డి, పాల్గొన్న అధికారులు

ఖమ్మంవ్యవసాయం: మిగతా సంస్థలతో పోలిస్తే తాము అతి తక్కువ వడ్డీ రేట్లతో గృహ రుణాలు అందిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు(ఏపీజీవీబీ) చైర్మన్ కె.ప్రతాపరెడ్డి వెల్లడించారు. ఖమ్మంలోని ఏపీజీవీబీ ప్రాంతీయ కార్యాలయంలో బుధవారం బిల్డర్స్ మీట్ జరిగింది. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా ప్రతాపరెడ్డి మాట్లాడుతూ గత నెల 20 నుంచి సెప్టెంబర్ 30వ తేదీ వరకు రుణమేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమయంలో గృహ రుణాలు తీసుకున్న వారికి ప్రాసెసింగ్ ఫీజు ఉండకపోగా, వడ్డీ రేటు కూడా కూడా అత్యల్పంగా 8.35 శాతంగానే నిర్ణయించామని చెప్పారు. మహిళలకు ప్రత్యేకంగా మరో 0.05 శాతం తగ్గింపు ఉంటుందని చెప్పారు. అనంతరం వ్యవసాయ రుణాలపై జిల్లా వ్యవసాయ, పశుసంవర్ధక, ఉద్యాన శాఖ అధికారులతో పాటు లీడ్ బ్యాంకు మేనేజర్‌తో సమావేశమై ప్రణాళిక రూపొందించారు. ఏపీజీవీబీ ఖమ్మం రీజనల్ మేనేజర్ విజయ్‌భాస్కర్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో బ్యాంకు చీఫ్ మేనేజర్ దేవేందర్, అడ్మిన్ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్యాంక్ సేవల్లో ప్రతిభ కనబర్చిన మేనేజర్లను చైర్మన్ సత్కరించారు.


చోరీ కేసుల్లో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీసీఎస్ డీఎస్పీ మోహన్

మహబూబాబాద్ రూరల్: రెండు జిల్లాల్లోని వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడిన నిందితుడిని మహబూబాబాద్ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఈమేరకు నిందితుడితో పాటు సొత్తు భద్రపర్చిన ఇద్దరిని అదుపులోకి తీసుకుని రూ.5.30 లక్షల విలువైన 7.50 తులాల బంగారం, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో సీసీఎస్ డీఎస్పీ గంద్రతి మోహన్ వివరాలు వెల్లడించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ నెహ్రూనగర్ ప్రాంతానికి చెందిన కొట్ల ముత్యాలరావు ఎనిమిదేళ్లుగా భద్రాచలం, పాల్వంచ, కొత్తగూడెం, మహబూబాబాద్ ప్రాంతాల్లో 20 వరకు చోరీలు చేసి పోలీసులకు పట్టుబడి పలుమార్లు జైలుకు వెళ్లాడు. రాత్రి సమయంలో తలుపులు తెరిచి నిద్రిస్తున్న వారి ఇళ్లలో చోరీలు చేసే ఆయన బెయిల్‌పై బయటకు వచ్చాక గత జనవరిలో మహబూబాబాద్‌లో మూడు చోరీలు చేశాడు. ఆ సొత్తును భద్రాచలం శిల్పినగర్ కాలనీకి చెందిన వట్టికూటి వెంకటేష్ వద్ద భద్రపరిచాడు. ఈక్రమంలో సొత్తును విక్రయించేందుకు చోరీ చేసిన బైక్‌పైనే మహబూబాబాద్‌కు బుధవారం వచ్చిన వారు అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈసందర్భంగా విచారించగా చోరీలు చేసినట్లు ఒప్పుకోవడంతో సుమారు రూ.5.30 లక్షల విలువైన 7.50 తులాల బంగారం, బైక్ స్వాధీనం చేసుకున్నారు. కాగా, నిందితులపై పీడీ యాక్టు నమోదు చేస్తామని డీఎస్పీ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేయడంలో కీలకంగా వ్యవహరించిన సీసీఎస్, టౌన్ ఇన్‌స్పెక్టర్లు ఈ.భీమేశ్, వై.సతీశ్, ఎస్ఐ బీ.సతీశ్, సిబ్బంది శంకర్, ఉపేందర్‌రావు, ఉమామహేశ్వర్, రహమత్ అలీ, పాపయ్య, బాలు, విజయ్ కుమార్, సుధాకర్, రాజేశ్‌ను ఎస్పీ శరత్ చంద్ర పవార్ అభినందించారు.

మూడు గనుల్లో డిసెంబర్ నుండి బొగ్గు ఉత్పత్తి



సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి పరిధిలోని వీకే ఓసీ, రొంపేడు ఓసీ, గొల్లేటి ఓపెన్‌కాస్ట్‌ల్లో ఈ ఏడాది డిసెంబర్ నుంచి బొగ్గు ఉత్పత్తి మొదలుపెట్టేలా అనుమతులు సాధించాలని సీఎండీ ఎన్.శ్రీధర్ ఆదేశించారు. హైదరాబాద్‌లో బుధవారం ఉన్నతాధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ ఆయాగనులకు సంబంధించి అటవీ అనుమతులు త్వరగా తీసుకుని ఉత్పత్తి ప్రారంభించాలని తెలిపారు. కాగా, కొత్తగూడెం ఏరియాలోని వీకే ఓసీలో ఉత్పత్తి లక్ష్యం 43 లక్షల టన్నులు కాగా ఈ ఏడాది కనీసం 7 లక్షల టన్నులు, ఇల్లెందు ఏరియాలోని రొంపేడు(జేకే) ఓసీలో వార్షిక లక్ష్యం 20 లక్షల టన్నులకు ఈ ఏడాదికి రూ.3 లక్షల టన్నులు ఉత్పత్తి సాధించాలని చెప్పారు. అలాగే, ఒడిశాలోని నైనీ బ్లాక్‌పై సమీక్షించారు. ఈ సమావేశంలో డైరెక్టర్లు ఎస్.బలరామ్, ఎన్వీకే.శ్రీనివాస్‌రావు, వెంకటేశ్వరరెడ్డి, జీఎంలు పాల్గొన్నారు.